ఆధ్యాత్మిక అంతర్జాల పత్రిక

# శ్రీసన్నిధానం

సంపుటి 02 సంచిక 03

మార్చి 2023



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. సంపాదకీయం
4. సప్త వర్ణ-వత్సరాంత ఫాల్గుణం
5. మన దేవాలయాలు
6. రామానుజ సుధామాధురి
   శరీర శుద్ధి - జ్ఞాన సిద్ధి
8. సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం
9. శ్రీపతిస్తుతి
11. సమతా కుంభ్ 2023
12. శోభకృత్ నామ సంవత్సరం
13. జ్యోతిర్విజ్ఞానమ్
16. ఆధ్యాత్మిక వార్తలు




**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి — చీఫ్ ఎడిటర్
సముద్రాల శారద — వోపీనియన్ ఎడిటర్
డింగరి శ్రీనివాసమూర్తి — మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
శ్రీమాన్ అమరవాది వెంకటనర్సింహా చార్యులు

# ముఖచిత్ర పరిచయం

పట్టాభిరాముడు పలు సమస్యలను పరిష్కరిస్తాడని లోకోక్తి. పెద్దలు చెప్పగా విన్నాం! ప్రతి ఇంటా రామపట్టాభిషేక చిత్రపటం ఉంచుకోవడం ఆనవాయితీ. ముఖ్యంగా గుమ్మంపైన దర్బార్‌లో వేంచేసి ఉన్న శ్రీరాముడు ఉంటే ఆఇంట సుఖశాంతులు వెల్లివిరుస్తాయని ప్రగాఢ నమ్మకం. సుగుణాల రాముడు, మర్యాద రాముడు, పట్టాభిరాముని గురించి మనకు ఎన్నో పురాణ ప్రవచనాలు దర్శనం ఇస్తాయి. బాల్యం నుంచి పట్టాభిషేక ఘట్టం వరకు శ్రీరాముని జీవన విధానంలో ఒకమారు తొంగి చూస్తే, మర్యాద అన్న మాటకు ఎన్నో అర్థాలు పరమార్థాలు మనకు దర్శనం ఇస్తాయి. ముఖ్యంగా కొత్తసంవత్సరం ఉగాదితో ఆహ్వానించిన వేళ మనకు ముందుగా వచ్చేది శ్రీరామనవమి, శ్రీరామపట్టాభిషేకము. సంవత్సరం మొత్తానికి అన్ని వేళలా శుభాలు కలుగచేయడానికి పట్టాభిరాముడు ధనుర్ధారియై తన పరివారంతో మనముందు శ్రీసన్నిధాన ముఖచిత్రంగా దర్శనం ఇచ్చాడు. ఇక ఉగాది ప్రస్తావన తీసుకువస్తే ఇది అనాదిగా వస్తున్నదే! శాలివాహన చక్రవర్తి పట్టాభిషిక్తుడు అయినరోజు ఉగాది అని చరిత్ర చెబుతోంది. ఇప్పటికీ పంచాంగకర్తలు శాలివాహన శకంగా ప్రస్తావిస్తుంటారు. అంతకుపూర్వం ఖగోళశాస్త్రవేత్త వరాహమిహురుడు చెప్పిన ఉగాదికూడా మనకొత్త సంవత్సరం మొదటిరోజునే. కలియుగ ప్రారంభం కూడా ఉగాది నుంచే. ఎన్ని విషయాలు విశేషాలు చెప్పుకున్నా, పట్టాభిరాముని చలువతో శ్రీసన్నిధానం ముందుకు వెళుతోందన్న భావన చిత్రకారుని కుంచె చెబుతోంది.


**PUBLISHED BY :** డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్



చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 878 2253323 ; 9502583323;



నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

## సంపాదకీయం



# సంప్రదాయ పరిరక్షణకు సిద్ధంకండి!

హిందూ సంప్రదాయ పరిరక్షణ చారిత్రక ఆధారాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఇటీవలి కాలంలో ఎన్నో ఆధారాలు లభ్యం అవుతున్న విషయాలను దృష్టిలో పెట్టుకుని తిరుపతి విశ్వవిద్యాలయం విద్యార్థులు పరిశోధనలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఈ బాధ్యతను విదేశాలలో ఉన్న హిందూ ధార్మిక సంస్థలు చేపట్టాయి. అయితే మారుతున్న పరిస్థితులతో పాశ్చాత్య నాగరికతవైపు ఒకవైపు యువత మొగ్గుచూపుతున్నా, కుటుంబ వ్యవస్థ, వివాహ, జీవన శైలి, ఆదర్శ విధానాలవైపు పాశ్చాత్యులు సైతం మొగ్గు చూపుతున్నారు. ఈ దశలో ఎన్నోవాస్తవాలు బయటపడుతున్నాయి. కొత్తపుంతలు తొక్కుతున్న జీవన విధానం కూడా కొంతవరకు ప్రయోజనకరంగా కనిపిస్తున్నా మరోవైపు ఇబ్బందికరమైన పరిస్థితులను సృష్టిస్తున్న సందర్భాలు లేకపోలేదు. మల్టీమీడియా ద్వారా ప్రచారాలు జరుగుతున్న వేళ ఏది నిజం ఏది అబద్ధం అని చెప్పలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మన దేశంలో విదేశీ పాలన ప్రారంభమయ్యాక వారి ఆలోచనా ధోరణులు విధానాలు క్రమంగా మనపై రుద్దే ప్రయత్నాలు జరిగాయి. అది నేటికీ కొనసాగుతున్నా, చైతన్యమైన ధార్మిక సంస్థలు వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. బ్రిటిష్ పాలన సమయంలో లార్డ్ మెకాలే విద్యావిధానం దేశప్రజలమీద రుద్దడం ప్రారంభమయ్యాక, వేదవిద్య క్రమంగా అంతరించింది. సంస్కృత విద్యాబోధన క్రమంగా తగ్గిపోయింది. వేదగణితం వచ్చిన వారు నేడు వేళ్లపై లెక్కపెట్టేలా ఉన్నారు. ఎప్పుడో మనదేశంలో చేసిన పరిశోధనలు, వాటికి సంబంధించిన వివరాలు అన్నీ సంస్కృతంలో ఉండటం, వాటి అధ్యయనం క్రమంగా అంతరించడంవల్ల వాటిలో ఉన్న వైజ్ఞానిక విషయాలు నేడు కొన్ని విదేశ సంస్థలు చేపడుతున్న పరిశోధనల వల్ల బయటపడుతున్నాయి. వాస్తవాలను మరుగునపడే విధంగా అందుబాటులోకి రావడంతో ఇదే నిజమని నమ్మేస్థితి నుంచి క్రమంగా తేరుకుంటున్నాము. విశ్వవిద్యాలయాలలో చాలా సందర్భాలలో చేస్తున్న పరిశోధన ఫలితాల వల్ల చైతన్యం వెల్లివిరుస్తోంది. రామానుజసహస్రాబ్ది తరుణం ఆ దిశగా పరిశోధనలు ప్రారంభమయ్యాయి. ఆధునిక భాషలో చెప్పుకోవాలంటే టెంపుల్ సిటీగా పేరుతెచ్చుకున్న తిరుపతి నగరాన్ని గురించి శ్రీరామానుజుల వారి కాలంలో శాసనాలపై పరిశోధనలు చేశారు. ఆ పరిశోధన ఫలితంగా 24 ఫిబ్రవరి 1130 సంవత్సరంలో తిరుపతి నగరానికి భగవత్ రామానుజ స్వామి వారు శంకుస్థాపన చేశారన్న విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. ఈ సందర్భంగా తిరుపతిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు ఆధ్యాత్మికవేత్తలు, రాజకీయ నాయకులు కూడా ముందుకువచ్చినట్లు వార్తలు వచ్చాయి. సౌమ్యనామ సంవత్సరం ఫాల్గుణ పౌర్ణమి ఉత్తరానక్షత్రం సోమవారంరోజున శ్రీవారి పాదాల చెంత తిరుపతి నగరం వెలియడానికి అంకురార్పణ జరిగినట్లు ఆధారాలున్నాయని చెబుతున్నారు. ఈ సందర్భంగా శ్రీరామానుజులవారు స్వయంగా వేంచేసి ఉండి నిర్మించిన శ్రీగోవిందరాజ స్వామి ఆలయం నుంచి ఉత్సవాలు నిర్వహించారు. నాడు తొలుత గోవిందరాజపట్టణమని తరువాత రామానుజపురమని, తరువాత తిరుపతిగా నామకరణం చేశారని చారిత్రక ఆధారం. ఇది ఇలా ఉంటే మారిషస్‌లోని అతిపెద్ద హిందూ ఆలయం నిర్మాణం జరిగిన తేదీ ఆధారాలు లభించినట్లు చెబుతున్నారు. దేశంలో విదేశాలలో ఆలయాలు నిర్మాణాలు జరిగిన ప్రదేశాలలో శిలాశాసనాలు లభ్యం అవుతాయి. వాటిని వెలికి తీసి పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. వాస్తవాలను మాత్రమే ప్రచారంలోకి తెచ్చేప్రయత్నంలో మనం కంకణ బద్ధులమై ముందుకు నడుద్దాం!

– చీఫ్ ఎడిటర్

# సప్త వర్ణ శోభితం -వత్సరాంత ఫాల్గుణం

శ్రీసన్నిధానం సుమారు పన్నెండు నెలలుగా మాసవైశిష్ట్యం నూతనశైలిలో ఆవిష్కరిస్తోంది. ఎన్ని విషయాలు చెపుతూ వస్తున్నా కొత్తసంగతులు పరిచయం చేయగలమన్న భావన విశ్వాసం అనుక్షణం నూతనోత్సాహంగా ముందుకు వస్తూనే ఉంది. సంప్రదాయాలు వాటి పరిరక్షణ బాధ్యత ప్రతి సంచికలో భుజస్కంధాలపై వేసుకుని ఎన్నో విషయాలను మీముందుకు తెస్తోంది. మారుతున్న జీవన శైలికి అనుగుణంగా మన సంప్రదాయాలను అనుసరిస్తూ నడుచుకోవలన్న అభిమతానికే ఎక్కువ ప్రాధాన్యత,

మన ప్రాచీన ధర్మం, ఆచారాలు సుఖ జీవన మార్గదర్శకాలు. పరిష్కారాలను చూపించే సూచికలు కూడా! లోకంలో ప్రతి ఒక్కరి జీవితం ఒక్కొక్క రకంగా ఉంటుంది. ప్రతి మానవుడి జన్మము వైయక్తిక భేదం కలిగి ఉంటుంది. అలా ఉండటానికి అనేక అంశాలు ప్రభావితం చేస్తాయని శాస్త్ర జ్ఞానం గల పెద్దలు చెప్తారు. ఆధునిక ఆలోచన విధానంలో హేతుబద్ధత పేరిట విశ్వాసాలు కొంత కొరవడినా ఆచారాలు ఆచరణలు సమాజంలో ఎక్కువగానే కనిపిస్తాయి. మన భారత దేశ గొప్ప సంస్కృతిలో అంతర్లీనంగా ఉండే పరమార్థం విద్యా వివేక సంపన్నులు ఎవరైనా ఒప్పుకోక తప్పదు. పరంపరాగతంగా వచ్చే సాంప్రదాయాల పైన గల విశ్వాసాల వెనుక ఎన్నో శాస్త్రబద్ధమైన నిరూపణలు ఉన్నాయి. కాల ప్రమేయంతో పరిణామం పొందే ప్రకృతితో, సమస్తాన్ని శరీరంగా ధరించిన భగవంతునితో మానవునికి గల సంబంధాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకో గలగాలి. ఆ జ్ఞానంతో మానవుడు సంచరించగలిగినప్పుడు, సమన్వయంతో సామరస్యంగా జీవించగలిగి నప్పుడే హితకరమైన ఫలాలను పొందగలుగుతాడు. అటువంటి నియమాలను మనకు తెలియజేస్తాయి మన పండుగలు, పర్వదినాలు. ఆ విధంగా మన పెద్దలు ఏర్పరచినవే నోములు, వ్రతాలు, శుభకార్యాలు, సుముహూర్తాలు, ఉపవాసాలు, దానధర్మాలు ఇత్యాదులు.



సమాజ హితంగా ఆరోగ్య దాయకంగా శాస్త్ర విహితంగా చెప్పబడి శుభ ఫలితాలనిచ్చే సాంప్రదాయాలను ఆనవాయితీగా ఆచరించడం శుభప్రదం. అటువంటి విశేషాలను శుభాలను అందించే ఫాల్గుణ మాసం తెలుగు సంవత్సరాలలో చివరి మాసం. ఫల్గుణి నక్షత్రము విశేషమయినది. జన్మనక్షత్రము అయినందున అర్జునునికి ఫల్గుణుడని పేరు. "ఫల్గుణ్యావిర్భవాయై నమః " అని అమ్మవారి నామము. సూర్య మానమును ఆచరించే తమిళ దేశంలో దివ్య దేశాలలో ఫల్గుణి ఉత్సవాలు వైభవంగా చేస్తారు. ఫల్గుణీ నక్షత్రముతో కూడిన చంద్రుడు గల మాసం ఫాల్గుణ మాసం. ఈ మాసం శిశిర ఋతువులో రెండవ మాసం కనుక ఆకులు రాల్చేటి శిశిరంతో ప్రకృతి పరిశుద్ధమై తిరిగి చిగురిస్తూ వసంత ఛాయలను సంతరించు కుంటుంది. మామిడి పూతలతో పుష్పితమై వేసవి వెచ్చదనాన్ని పులుము కుంటుంది. చిగురు రంగుల శోభను అలుము కుంటుంది. "శివరాత్రి శివస్మరణ తో చలి మళ్ళి పోతుందని" సామెత చెప్తారు. లౌకికంగా ఈ మాసంలో విద్యార్థులు ఉన్న ఇండ్లలో పరీక్షల సందడి ప్రారంభ మవుతుంది. చిన్నలు పెద్దలు ఎదురుచూసే రంగుల హరివిల్లులు కురిపించే పండుగ హోళి ఈ మాసంలో వస్తుంది. ఒకరిపై ఒకరు వసంతం (రంగులు) చల్లుకొని విందు వినోదాల్లో పాల్గొంటారు. వీధుల్లో ఊరి పొలిమేరల్లో కామ దహనం, హోళికా దహనం నిర్వహిస్తారు.

తారకాసుర సంహారానికి శివపార్వతుల సమాగమం జరగాలి. అందుకు దేవతల ఆజ్ఞతో మదనుడు పుష్ప బాణ ప్రయోగానికి సిద్ధమవుతాడు. తపోదీక్షలో ఉన్న శివుడు మూడో నేత్రం తెరిచి మదనుణ్ణి దహనం చేస్తాడని పురాణ కథ! తిరిగి వరాన్ని పొందిన మదనుడు రాక్షస సంహారానికి కారణ భూతుడయ్యాడని ఈ పూజ నిర్వహిస్తారు.

(మిగతా 7 వ పేజీలో)

# కొండలపై కొలువైన బీర్పూరు స్వామి

## మన దేవాలయాలు


సేకరణ - డింగరి హేమంత్ ఆచార్యులు





హిరణ్యకశిపుని గర్వాన్ని అణచడానికి ప్రహ్లాదుని భక్తిని చాటడానికి ఆస్తికత్వాన్ని నిరూపించడానికి రాక్షస సంహారానికి, నర మృగ రూపాన్ని ధరించి వచ్చిన హరి అవతారమే నరసింహా అవతారం. విష్ణు అంటేనే అంతటా వ్యాపించి ఉన్నవాడు అని అర్థం. అందుకే నేలపైనే కాకుండా ఈ నరసింహా అవతార ఆలయాలు ఎక్కువగా కొండ పైన ఉంటాయి. మన తెలుగు రాష్ట్రాల్లో సుప్రసిద్ధ నరసింహ ఆలయం అహెూబిలం ఈ అహెూబిలం క్షేత్రం నుంచి వచ్చి మరెన్నో క్షేత్రాల్లో నరసింహ స్వామి వెలసినట్లు మనకు స్థల పురాణాలు చెబుతున్నాయి. అందులో ఒకటి బీర్పూర్ నరసింహస్వామి క్షేత్రం. తెలంగాణలో జగిత్యాల్ నుండి సుమారు 25 కిలోమీటర్లు దూరంలో బీర్పూర్ గ్రామంలో కొండపైన స్వామి అందరికీ దర్శనమిస్తున్నాడు. ఈ గ్రామంలో మనకు పెద్ద గుట్ట చిన్న గుట్ట అనే రెండు కొండలు ఉన్నాయి మొదట స్వామి పెద్ద గుట్ట పైన వెలసి నమ్మాచార్యులు అనే భక్తునికి స్వప్నంలో కనిపిస్తాడు. అప్పుడు ఆ నమ్మాచార్యులు భక్తులతో కలిసి వెళ్లి చూస్తే అక్కడ స్వామి దర్శనం ఇస్తాడు. ఆ కొండకు మెట్ల మార్గం కానీ రోడ్డు మార్గం కానీ ఉండదు. కొండపైకి దట్టమైన అరణ్యంలో నుంచి దారిని కనుక్కుంటూ వెళ్లడం మాత్రమే సాధ్యం. స్వామి వారు పెద్దగుట్ట వద్ద కు వచ్చే సమయంలో గుర్రము డెక్క జారిన గుర్తులు అక్కడ ఉండటం వల్ల స్వామివారి మీద ప్రేమతో భక్తులు గుర్రాన్ని గుర్రపు బొమ్మలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

స్వామివారికి పెద్దగుట్ట పై కస్తూరి తిలకం దిద్దిన విధానం కూడా ప్రచారంలో ఉంది పెద్దగుట్ట పైన స్వామివారిని సేవించడానికి వచ్చినవారు ముందుగా అంటే గుట్ట పైన ఉన్న కొలనులో స్నానం చేసి స్వామి వారి ముందుకు తడి బట్టలతో వెళ్లడం ఆనవాయితీ. స్వామి దర్శనం ఇస్తున్న ప్రదేశం పడకు ఒక చెంబు పట్టే విధంగా రాతికి హెూలు ఉంది దానిలో నుండి తీర్థాన్ని తీసుకొని స్వామివారికి అభిషేకం చేస్తారు.





ఒక పాలమ్ముకునే ముసలావిడకు కనిపించి పెద్దగుట్టపై సపర్యలు చేశాడని, చిన్నగుట్టపైకి కూడా వచ్చి మేకల కాపరికి బాలునిరూపంలో కనిపించి మాయమయ్యాడని కథలుగా చెప్పుకుంటారు. ఆవిధంగా పెద్దగుట్టపై , మరియు చిన్నగుట్టపై కూడా నరసింహ స్వామి వెలశాడు. పెద్ద గుట్టపై ఆలయం ఉండదు. గ్రామస్తులు చిన్నగుట్టపై ఒక ఆలయాన్ని నిర్మాణం చేసి స్వామివారి మూలవిరాట్‌ని ప్రతిష్ఠించడం జరిగింది. సుమారుగా ఒక 700 సంవత్సరాలకు పూర్వపు చరిత్ర గల ఆలయం మొత్తం కూడా రాతి ఆలయం గుట్టమార్గం. ఆలయ నిర్మాణం సరిగ్గాలేని కాలంలో ఆవహన చేసిన ఉత్సవమూర్తులను అర్చకుల స్వగ్రామమయిన తుంగూరు లో వేణుగోపాల స్వామి దేవాలయంలో వేంచేపు చేసి ఆరాధనలు నిర్వహించేవారు. ప్రాచీనం నుంచి వొద్దిపర్తి వంశీయులు నారాయణాచార్యులు, లక్ష్మి నరసింహాచార్యులు, వరదచార్యులు **(మిగతా 10 వ పేజీలో)**







# శ్రీరామానుజ సుధామాధురి



## శరీరశుద్ధి - జ్ఞానసిద్ధి

**మానవజాతి ఉజ్జీవనానికి ఉపయోగపడే అనేక అంశాలను శ్రీభగవద్ రామానుజాచార్యులు ఉపదేశించారు. అటువంటి వేల సంవత్సరాల ప్రాచీన పరంపర గల గొప్ప సంప్రదాయంలో జన్మించిన మనందరం ఆ రామానుజ మార్గ చరిత్ర విశేషాలు తెలుసుకోవాలి. వారి ఉపదేశ శ్రీ సూక్తులు ఆధునిక సమాజానికి అనువర్తనీయం కావాలి. ఆ సంకల్పంతో అక్షరాత్మకమైన ప్రయత్నంగా "శ్రీరామనుజ సుధా మాధురి" అనే శీర్షికతో శ్రీ సన్నిధానం పత్రిక సాగుతున్నది.**

"భగవంతుడు" అంటే ఎవరు అనే ప్రశ్నకు షాడ్ గుణ్య పూర్ణుడనే నిర్వచనాన్ని, వివరణను పెద్దలు చెప్తారు. జ్ఞాన, ఐశ్వర్య, బల, వీర్య, తేజస్, శక్తి పరిపూర్ణుడని భావం. "ఏకో నారాయణః న ద్వితియోస్తి కశ్చిత్" భగవంతునికి "ఏకః" అనే లక్షణం కూడా ప్రధానమైనది. అనగా అందరిలోకి ఒక్కడే పరమాత్ముడు అని మాత్రమే కాకుండా అందరికీ ఒక్కడే అనేది ముఖ్య లక్షణం! అందరూ ఆశ్రయించ తగినవాడు భగవంతుడు ఒక్కడే కనుక అందరిపైనా సమస్తము పైన సమదృష్టి కలిగే ఉంటాడు. "ఏక విజ్ఞానేన సర్వజ్ఞానం" అన్నట్టు జగత్కారణుడైన సర్వేశ్వరుడు ఒక్కడే! శ్రియపతికి సమస్తానికి శరీర శరీరి భావ సంబంధాన్ని వారు తెలియచేసారు. మరియు భగవత్ సృష్టి అంతా సత్యమే అని నిరూపిస్తూ నవనిధుల వంటి గ్రంథాలను శ్రీ రామానుజాచార్యులు రచించారు.

అందులో నాయక మణి "శ్రీభాష్యం" గ్రంథం. తర్వాతి ఆచార్యులు ఆ గ్రంథాలను ప్రకాశింప చేసే దివ్య జ్యోతుల వంటి వ్యాఖ్యాన ప్రకాశికా గ్రంథాలను రచించారు.

పరబ్రహ్మన్ని ప్రకాశింప చేసిన వ్యాసభగవానుని వలె పరతత్వాన్ని నిరూపించి సిద్ధాంతీకరించినందున శ్రీరామానుజాచార్యులు భగవద్రామానుజాచార్యులుగా సంభావింపబడ్డారు. పూర్వాచార్యులచే భవిష్యదాచార్యులుగా ముందే సంకల్పం చేయబడి భగవద్రామానుయాచార్యులుగా కీర్తించబడ్డారు. భగవంతుని దృష్టిలో అందరూ సమానమే అన్న సమవర్తిత్వం శ్రీభగవద్రామానుజాచార్యుల ఆచరణలోనూ ఉన్నది. సమవర్తి అయి సంచరీస్తూ జగత్తునంతటిని ప్రకాశింప చేసిన సూర్య భగవానునితో సమానంగా జ్ఞాన సూర్యులై ప్రబోధించిన భగవద్రామానుజాచార్యులను "రామానుజ దివాకరః" అని పెద్దలు సమన్వయం చేస్తారు. అలాగే సూర్య భగవానునికి వేదానికి సామ్యాన్ని వేదమే తెలుపుతుంది. ప్రతిరోజు మూడు కాలాల్లో సూర్య భగవానుడు మూడు వేదాలతో సంచరిస్తాడట! అట్లే "ఆదిత్యోవా ఏష తన్మండలం తపతి. సైషా త్రయ్యేవ విద్యా తపతి" వేదమే ఆదిత్య మండలమై ప్రకాశిస్తున్నదట! ఉభయ వేదాంత సార జ్ఞాన పూర్ణులైన భగవద్రామానుజాచార్యులు సత్య నిరూపణం చేశారు. "ఆచార్యవాన్ పురుషో వేద" అన్నట్లుగా ఆచార్యులు గలవారే సత్యాన్ని తెలుసుకోగలుగుతారు. ఆ ఆచార్యులు, పరమాచార్యులు, భగవద్రామానుజాచార్యులే! సర్వేశ్వరుడైన భగవంతుడు, సర్వసాక్షి అయిన సూర్యుడు, సర్వోత్కృష్టమైన వేదము, సర్వజ్ఞత్వం గల జగదాచార్యులు సమవర్తులే! భగవద్రామానుజాచార్యుల దృష్టిలో సమత్వ భావము ఎంతో గొప్పది. శరీర సంబంధ వర్ణ సంబంధ వివక్షతలు లేనిది. శరీర శుద్ధి కంటే జ్ఞాన స్ఫూర్తి కి ప్రాధాన్యమిచ్చే వారి తాత్విక విశ్లేషణ చాలా గొప్పది.వారి చరిత్ర వైభవంలో అనేక సన్నివేశాలలో వారి భావ స్ఫూర్తి పులకాంకురాలు కలిగిస్తుంది.

ఒకసారి ధనుర్దాసుడనే మల్లుడు, అతని భార్య అయిన హేమాంబ శ్రీ రంగనాథ స్వామి ఉత్సవ దర్శనానికి వచ్చారు. ధనుర్దాసు తన భార్య నేత్ర సౌందర్యం పై ప్రీతితో చేసే వింత చేష్టలను యతిరాజులు పరిశీలించారు. అతనిలోని హృదయ సున్నితత్వానికి సౌందర్యారాధనకు యతిరాజులు స్పందించారు. సౌందర్య సౌగంధ్య సౌకుమార్య అనంత కళ్యాణ గుణనిధి అయిన శ్రియఃపతి సౌందర్యారాధనకు ధనుర్దాసులో ప్రేరణ కలిగించాలని సంకల్పించారు. వెంటనే ధనుర్దాసుతో సంభాషించి, ఒప్పించి శ్రీ రంగనాథుని గొప్ప నేత్ర సౌందర్యాన్ని చూపించారు. తీర్థ మహిమతో అతన్ని భగవత్ అభిముఖునిగా చేశారు. పవిత్రమైన సౌందర్య తృష్ణకు పరాకాష్ట భగవద్భక్తి అనే సత్యాన్ని **(మిగతా 10 వ పేజీలో)**



# సప్త వర్ణ శోభితం వత్సరాంత ఫాల్గుణం

**(4వ పేజీ తరువాయి)**

హిరణ్య కశిపుని సోదరి హెూళిక. ఈమెకు అగ్నిలో దహనం కాకుండా ఉండే శక్తి ఉంటుంది. విష్ణు భక్తుడైన ప్రహ్లాదుని తండ్రియగు హిరణ్యకశిపుడు హింసించడానికి ప్రహ్లాదుని హెూళిక ఒడిలో ఉంచి అగ్నిలో ప్రవేశింపచేస్తాడు. విష్ణు భక్తి పరవశుడైన ప్రహ్లాదుని అగ్ని దహించక హెూళికను దహించి వేస్తాడట! ఈ విధంగా రాక్షస సంహారానికి గుర్తుగా “బాలపీడా నివృత్తి” అని పాత వస్తువులు కట్టెలు వేసి దహనం చేస్తారు. మాఘ,పాల్గుణ మాసాల్లో నరసింహ క్షేత్రాలలో బ్రహ్మోత్సవాలు (జాతరలు) జరుగుతాయి. పుణ్యక్షేత్రాలలో డోలోత్సవాలను నిర్వహిస్తారు. యాదగిరిగుట్ట, ధర్మపురి క్షేత్రాలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి తిరుమలలో కూడా స్వామి పుష్కరిణిలో సాలకట్ల తెప్పోత్సవాలు జలవిహారాలు నిర్వహిస్తారు. ఫాల్గుణ మాసం ప్రారంభం నుండి 12 రోజులు ద్వాదశి వరకు పయో వ్రతం పేరుతో

క్షీరాబ్దినాధునికి క్షీరాన్నం నివేదించి ఆరాధిస్తారు. ఈ వ్రతమాచరించి అదితి వామనమూర్తిని పుత్రునిగా పొందినదని పురాణ కథ! విశేషమైన ఫాల్గుణ మాస విశేషాలను పెద్దల మాటగా తెలుసుకుందాము.

శుద్ధ పాడ్యమి పయోవ్రతం, తృతీయ సౌభాగ్య తృతీయ వ్రతం. చతుర్థి అవిఘ్న గణపతి వ్రతం నువ్వుల దానం హెూమాదులు ఆచరిస్తారు. పంచమి అనంత పంచమి వ్రతం. సప్తమి భాను సప్తమి, కామదా సప్తమిగా సూర్య పూజ చేస్తారు. అష్టమి ప్రతి మాసం వలె దుర్గాష్టమి. లలితా కాంతి దేవి వ్రతం. నవమి ఆనంద నవమి. మరియు దుర్గా పూజ చేస్తారు. ఫాల్గుణ శుద్ధ ఏకాదశి విశేషమైనది. ఆమలక ఏకాదశిగా ఉసిరిక వృక్ష పూజ ఆమలక ఫల నివేదనం భగవంతునికి చేస్తారు. గొప్ప ఓషధి గుణాలు కలిగిన ఉసిరిక తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. ఉసురు అంటే ప్రాణము ప్రాణ శక్తిని కలిగిస్తుంది కావున ఉసిరిక అంటారని పెద్దలు చెప్తారు.”ఆమలక వృక్షే జనార్దనః” అని జనార్ధన ఆరాధనం విధించబడింది. ఉసిరికాయను గురించి ‘కరతలా మలకం’ అనే జాతీయ పదం కూడా ఉంది పూర్వం విద్యార్థులకు భూమిని గురించి బోధించేటప్పుడు ఉసిరిక కాయను చూపించే వారట ఆ విధంగా భూమికి ప్రతీకగా చెప్తారు. అందుకే కరతల ఆమలకం అంటే చేతిలోనే సమస్త జ్ఞానము అన్న అర్థం లో ఉపయోగిస్తారు. ద్వాదశి ఆమలకి వ్రతం. చతుర్దశి లలితాదేవి పూజ. మహా ఫల్గుణి డోలికా పూర్ణిమ, హెూళి పూర్ణిమ, ప్రసిద్ధమైన పర్వదినం. ప్రకృతిలో మారే రంగుల వసంతానికి ప్రతీకగా రంగుల కేళి, కామ దహనంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. ఉత్తర దక్షిణ భారతమంతా కూడా రంగులు వెల్లి విరుస్తాయి. ఉదయం రంగులు చల్లుకొని అందరూ కలిసి విందులు ఆరగిస్తారు. చిన్నపిల్లలకు రంగురంగుల చక్కెర పువ్వులతో కొబ్బరి కుడుకలతో హారాలు చేసి మెడలో వేస్తారు. వసంతం అంటే మోదుగు పూ రంగులో ఉండే ఎరుపు వర్ణము. గులాలు చల్లుకునే ఆచారం ఉండేది. నేటి ఆచారంలో అన్ని రంగులు చల్లుకోవడం పరిపాటిగా మారింది. “కాముని పున్నమి” గా ఉత్సాహంగా ఉల్లాసంగా గడపడం ఆచారంగా మారింది. బహుళ మందు అష్టమి సీతాదేవి జన్మదినము. ఏకాదశి పాప విమోచన ఏకాదశి. బహుళ ద్వాదశి నృసింహ ద్వాదశి పునర్వసు నక్షత్రం నాడు శ్రీ కులశేఖరాళ్వారు తిరునక్షత్రం. అమావాస్య రావణ సంహారం జరిగిన అమావాస్యగా ఫాల్గుణ అమావాస్యను చెప్తారు. ఫాల్గుణ మాసంలోని తిథులతో శ్రీరామాయణ కథ ఘట్టాలు ముడి పడి ఉంటాయి. మాఘ, ఫాల్గుణ మాసాలలో శు భకార్యాలకు అనేక సుముహూర్తాలు ఉంటాయి.ఫాల్గుణ మాసం వత్సరాంత మాసం కనుక వెను వెంటనే వచ్చే తెలుగు ఉగాది పర్వదిన ప్రభావంతో ఆనందంగా ముగుస్తుంది. భగవంతునికి, ప్రకృతికి, జీవునికి మధ్య గల సంబంధ జ్ఞానాన్ని మనచే అనుభవింప చేయు దైవీ శక్తికి ప్రతిరూపమే కాలగమనము. కాల గమనంలోని మార్పులు మనకు జీవిత పరమార్థాన్ని ఉద్బోధిస్తాయి. కాల గమనం లోని రహస్యాలను, పర్వదినాల ప్రయోజనాలను తెలియజేసే గ్రంథాలు, పురాణాలు, శాస్త్రాలు ఎన్నో ఉన్నాయి. ఆ విజ్ఞానాన్ని అనేక ఆచార సాంప్రదాయాల ద్వారా పెద్దలు మనకు అందించారు. ఆ పరంపరాగత సంస్కృతిని సంపన్నం చేస్తూ ఆచరిస్తూ తరవాత తరాలకు అందించాల్సిన బాధ్యత కర్తవ్యం మనందరి పైన ఉంది.

ఆ సద్భావన తో శ్రీ సన్నిధానం శుభకృత్ నామ సంవత్సరం ఉగాది చైత్రమాసం నుండి పెద్దల మాటగా మాస విశిష్టతలను అందించింది. “అంతానికి ప్రాయికంగా అర్థం ఆరంభమే” అన్నట్లు సంవత్సరంలో అంత్యమాసమైన ఫాల్గుణ మాసం ముగియగానే వెనువెంటనే వసంత శోభతో, షడ్రుచుల రసోత్కర్షతో “శోభకృత్” నామ సంవత్సర ఉగాది పండుగగా మన ముందుకు వస్తున్నది.

అట్లే మరిన్ని ప్రయోజనవంతమైన నవ శీర్షికలతో పెద్దల శ్రీ సూక్తులతో శ్రీ సన్నిధానం మీ ముందు ఉంటుంది.

# పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవమ్

**శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి స్థానాచార్యులు**

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం**



"జంతూనామ్ నరజన్మ దుర్లభం" అని అంటారు. అంటే లోకంలో, సృష్టిలో మానవ జన్మ దుర్లభమైనది. అనేకములైన ప్రాణులు ఉన్నప్పటికీ ఆ ప్రాణులన్నిటిలోకి జ్ఞాన విశేషము వల్ల మానవ జన్మ ఉత్తమమైనది అంటారు. అటువంటిదైన మానవ జన్మను సార్థక పరుచుకోవడం అంటే జన్మరాహిత్యం కోసం ప్రయత్నం చేయడం, ముక్తి కొరకు ప్రయత్నం చేయడం అని ఆధ్యాత్మికవేత్తలు అయినటువంటి వారు అంటారు. ఈ లోకం కంటే వేరే లోకములు ఉన్నవి అని, స్వర్గము, పుణ్యము, పాపము, ఆత్మ, పరమాత్మ మొదలైనటువంటివి ఉన్నాయి అని, మనం తెలుసుకోవడం విషయంలో కేవలం విశ్వాసం మాత్రమే ప్రధానమైనది. అంటే మనకు ప్రత్యక్షంగా గాని, ఊహించి గాని తెలుసుకోలేనటువంటి హేతువులను చూపించడానికి అవకాశం లేనటువంటిది ఈ జన్మ. ఈ లోకంలో మనము ఒకరి మీద ఒకరు ఆధారపడి ఉండడం కనిపిస్తున్నది. అంతే తప్ప నాకు ఎవరితో పని లేదు! నేను స్వతంత్రున్ని! అనుకునేటువంటి అవకాశం ఏ ప్రాణికి ఏ జీవికి లేదు. అలా అనుకున్నట్లయితే అజ్ఞానం అవుతుంది.

## శ్రీరామ నవమి ప్రత్యేకం



అజ్ఞానం అంటే అహంకారము, మమకారము. వీటి వల్ల ఏర్పడేటువంటి ఒక అజ్ఞానం. ఏదో ఒక సమయంలో ప్రతి ఒక్కరూ ఒక ప్రాణి పై ఆధారపడి ఉండడమే ఈ లోకంలో కనిపిస్తుంది. అందుకనే స్వర్గ నరకాలు, ఆత్మ పరమాత్మ, పుణ్య పాపాలు నమ్మినా నమ్మకపోయినా మనం సజావుగా ఒకళ్ళకు ఒకళ్ళము తోడుగా ఉంటూ చక్కగా మనుగడ సాగించడానికి మానవత్వం ప్రధానము. ఈ విషయంలో ఎవరికీ సందేహం లేదు. ఈ మానవత్వము ఎట్లా మనకు ఏర్పడుతుంది? అంటే ఎక్కడో ఒకచోట మనకు స్వార్థ రాహిత్యం ఉండడం అనేదే ప్రధానం. ఈ మానవత్వము అనేటువంటిది ఒక పరిధిలో ఉంటుంది. ఈ లోకంలో ప్రతి ఒక్కరికి తల్లిదండ్రులు, గురువు, పిల్లలు, స్నేహితులు, శత్రువులు మొదలైనటువంటి వాళ్లంతా కూడా ఉంటారు. వాళ్ళతో మనం ఎలా ప్రవర్తించాలి? అనేది మనకు ప్రధానంగా ఒకరు చెబితే వినడం, పుస్తకాల్లో చూసి తెలుసుకోవడం, అనేదానికంటే ఆచరించి చూపినప్పుడు అది మనకు బాగా మనసుకు హత్తుకుంటుంది. అటువంటి ప్రయత్నాన్ని భగవంతుడే రామావతారంలో చేశాడు. అనే విషయాన్ని పెద్దలు చెబుతుంటారు. ప్రధానంగా రామ కథలో రామాయణంలో ఉత్తమమైన ఒక మానవుడు ఎలా నడుచుకుంటే ఈ లోకంలో ఆనందంగా మనగలడో రాముని ఆచరణ ద్వారా జరిగింది. అనే విషయాన్ని మన పెద్దలు చెప్తూ ఉంటారు. రామకథ మనందరికీ ఆదర్శం అంటారు. అటువంటి రామచంద్రమూర్తి అవతరించిన రోజు శ్రీరామ నవమి.

శ్రీరామ నవమి, ఉగాది, కొత్త సంవత్సరం, తెలుగు సంవత్సరాది వచ్చిన తర్వాత వెంటనే చైత్ర శుద్ధ నవమి నాడు వస్తుంది. భగవంతుడు అనేక అవతారాలు ధరించినప్పటికీ ఈ అవతారాలలో మానవులకు చాలా దగ్గరగా ఉండి, మానవ ఆచరణను మనకు ఆచరణాత్మకంగా చూపించినటువంటి అవతారం రామావతారం కనక ఎంతో విశిష్టత కలిగి ఉంది. రామావతారం ఎంత గొప్పది అంటే రాముడు భగవంతుడు అని చెప్పుకోవడం కోసం వచ్చిన అవతారం కాదు. ఇది ఒక మానవుడు ఎలా ప్రవర్తించాలో అలాగే ప్రవర్తించి చూపించేటువంటి అవతారం. అందుకనే రాముడు తల్లిదండ్రుల దగ్గర ఎలా ఉండాలో అలా ఉన్నాడు, తండ్రి చెప్పినటువంటి మాటను జవదాటనివాడు. మాతృభక్తి పితృభక్తి అనేటువంటివి రాముని ద్వారా తెలుసుకోవచ్చు. అంతేగాక గురువులైన వశిష్టుని దగ్గర, విశ్వామిత్రుని దగ్గర రాముడు ఎంత గొప్పగా ప్రవర్తించాడో రామాయణంలో ఉంది. **(మిగతా 14 వ పేజీలో)**


# శ్రీపతి స్తుతి

# సుభాషితం
## మంచి మాట

శ్రియై నమః! శ్రీధరాయ నమః!

**హర్యష్టకం**

**(గత సంచిక తరువాయి)**



ఇంక మూడవది ఈ శ్లోకంలో "నైమిశారణ్య ఏవ చ" నైమిశారణ్యం. అక్కడ సూతుడు శౌనకాది మహామునులకు 18 పురాణాలు వినిపించాడు. యజ్ఞాది పుణ్యకార్యాలు చేయడానికి ఏ స్థలం మంచిది? అంటే చక్రాన్ని విడిచాడు. అది ఎక్కడ ఆగితే అదే మంచి స్థలం. అని చెప్పగా ఈ క్షేత్రంలో ఆగింది. కాబట్టి అది నైమిశారణ్యం అయింది. ఆ స్థలంలో ఏది చేసినా గొప్ప ఫలం లభిస్తుంది. (వారణస్యామ్ కురుక్షేత్రే నైమిశారణ్య ఏ వచ) అని ఈ మూడు క్షేత్రాలలో చేసిన పుణ్యమంతా 'హరి' అనే రెండు అక్షరాలు పలుకబడుచోట, పలికే వానికి అన్ని ఫలితాలు లభించును అని చెప్పబడింది.

4 వ శ్లోకం: పృథ్వ్యాం యాని తీర్థాని పుణ్యాన్యాయతనాని చ।
తాని సర్వాణ్య శేషాణి హరి రిత్యక్షర ద్వయం॥

ప్రతి పదార్థం: పృథ్వ్యాం= భూమియందు, యాని తీర్థాని= ఏయే పుణ్య నదులున్నవో, పుణ్యాని=పుణ్యములని ఇచ్చునట్టి, ఆయతనాని= నివాస స్థలములున్నవో, తాని=అట్టి, సర్వాణి= అన్నియు, అశేషాణి= ఏమియు మిగలకుండా, హరిః ఇతి= హరి అనే, అక్షర ద్వయం= రెండక్షరములు అగును.

తాత్పర్యము: లోకంలో జనులు పుణ్యాన్ని ఇచ్చే తీర్థ, క్షేత్రాలు దర్శించుకుంటారు వాళ్ల 'పాపాలు తొలగిపోవాలి' అని. భూ మండల మునందు అంతటను పుణ్య నదులు, పవిత్ర దేవాలయాలు చాలా ఉన్నవి. కానీ వాటిని పొందటం మనకు కష్టంతో కూడుకున్న పని. పైగా డబ్బు కావాలి. ఇంకా మనం పోవుటకు శక్తి కావాలి. తోడు కావాలి. సౌకర్యం ఏర్పడాలి. ఇవన్నీ ఇబ్బందులు ఏమీ లేకుండా ఉన్నచోటనే పుణ్యఫలం పొందాలి అంటే 'హరి అనే రెండు అక్షరాలు' భక్తితో మనస్సు లగ్నం చేసి విష్ణువును స్మరించుతూ అంటే చాలు అని భావం.

5 వ శ్లోకం: గవాం కోటి సహస్రాణి హేమ కన్యా సహస్రకం।
దత్తం స్యాత్ తేన యేనోక్తం హరి రిత్యక్షర ద్వయం।.

ప్రతిపదార్థం: యేనా=ఎవని చేత, హరిః ఇతి= హరి అని, అక్షర ద్వయం=రెండు అక్షరములు, ఉక్తమ్= చెప్పబడినవో తేన=అతని చేత, గవాం=గోవుల యొక్క, కోటి సహస్రాణి= వేల కోట్లు, హేమ కన్యా సహస్రకం=బంగారు ఆభరణములతో

శ్రీమాన్ అమరవాది వేంకటనరసింహాచార్యులు

కూడిన, వేలకొలది కన్యలను, దత్తం స్యాత్= ఇవ్వబడిన దగును

తాత్పర్యము: లోకంలో పుణ్యం రావాలంటే గోదానం చాలా ముఖ్యము. ఎందుకంటే గోవు శరీరంలో 14 భువనాలు, సమస్త దేవతలు కొలువై ఉంటారు. అందుచేత ఒక్క గోవును మంచి వేదవేత్త అయిన బ్రాహ్మణునకు దానం చేసినచో గొప్ప పుణ్యం అందుతుంది. అటువంటి గోవులను కోట్ల వేలు దానాలు చేస్తే ఇంకెంత పుణ్యం కలుగుతుంది? ఇంకా గొప్ప పుణ్యం మనకు అందించేది కన్యాదానము. ఒక్క కన్యను తగిన వరునకు దానం చేస్తే మహాఫలం దొరుకును. అంతేనా! ఆ కన్యకు బంగారు ఆభరణాలు ధరింప చేసి ఇస్తే అబ్బో! చెప్పరానంత పుణ్యఫలం!. ధర్మ, అర్థ, కామములు అనే మూడు పురుషార్థాలు సిద్ధిస్తాయి. అని పురాణాలు చెప్పుచున్నవి. కాబట్టి లోకంలో అందరూ ఆడబిడ్డలను కనాలని వ్రతాలు జపాలు చేస్తారు. వాళ్లకు ఆడబిడ్డ పుట్టక పోతే ఇతరుల కన్యలను దత్తత తీసుకునైనా కన్యాదానం చేస్తారు. అంత విశేషం ఉంది. కారణం ఏమిటి? అంటే మనం దానం చేసిన కన్య తగిన వరుణ్ణి పొంది అతని ద్వారా సంతానాన్ని పుత్రులను అందించితే పితృదేవతలు తరించుతారు. వంశము కుటుంబం వృద్ధి పొందుతుంది. పరమాత్మ సంకల్పం నెరవేరుతుంది. ఆడపిల్లలను కన్నట్లయితే కన్యాదానం చేసి పుణ్యం పొందుతారు. అందుకై కన్యాదానం శ్రేష్ఠం. అట్టి కన్యలను వేల కొలది కనకాభరణములతో యోగ్యుడైన వరునకిచ్చితే ఇంకా చెప్పలేని పుణ్యం వస్తుంది. అంత పుణ్యం అతి సులభంగా పొందే ఉపాయము 'హరి 'అనే రెండు అక్షరాలు కావున 'హరినామస్మరణము' సర్వదా చేయుచుండవలెను.

**మరికొన్ని మంచి విషయాలు వచ్చే సంచికల్లో...**

## శరీరశుద్ధి - జ్ఞానసిద్ధి

**(6వ పేజీ తరువాయి)** తెలియపరిచారు. ధనుర్దాసు మార్గంలో హేమాంబ కూడా జగదాచార్యులను ఆశ్రయించింది. కాచిన బంగారానికి స్వచ్ఛత ఎక్కువ అన్న రీతిగా ఆ దంపతుల పరిపక్వతను సందర్భానుసారంగా లోకానికి వెల్లడి చేశారు.

నిత్యం కావేరి నదిలో స్నానం చేయుటకు వెళ్లి వచ్చే జగదాచార్యులు వెళ్లేటప్పుడు శిష్యులైన మొదలియాండాన్ చేయి పట్టుకుని వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు ధనుర్దాసు చేయి పట్టుకుని వచ్చేవారట! ఇది చూసి ఎందరో ఆశ్చర్యపోయారు. "కాయ శుద్ధి వైలక్షణ్య విమర్శ"లో ( పుట్టుక లో జ్ఞానము లో ఏది గొప్ప) జన్మశుద్ధి కంటే జ్ఞాన శుద్ధి ప్రధానమైనదని వారు శిష్యులకు నిరూపించి చూపారు. "విద్య, ధన, అభిజన గర్వం వదిలిన వారే సత్పురుషులు వారు ఆకారత్రయ సంపన్నులైతే (భగవంతునికే చెందినవారము. భగవంతుని అధీనంలో ఉన్నవారము భగవంతుడు తప్ప మరో ఆశ్రయం లేనివారమనే భావము) ప్రపన్నులు". కేవలము శరీర శుద్ధియందే ప్రాధాన్య దృష్టి గల వైష్ణవ స్వాములకు ధనుర్దాసు గొప్పతనాన్ని తెలియచెప్పుటకు యతి రాజులు ఒక సన్నివేశాన్ని కల్పించారు.

స్వాములందరూ ధరించు కాషాయ వస్త్రాలను వారు చూడకుండా చిన్నచిన్న ముక్కలుగా చింపి పెట్టమని తన ఆంతరంగిక శిష్యుడికి ఆజ్ఞాపించారు. అతను అట్లే చేశాడు. వైష్ణవ స్వాములు ఎవరు చింపారో తెలియక వాదోపవాదాలు చేస్తూ ఒకరినొకరు నిందించుకున్నారు. పరిపక్వత లేని ఆ స్వాములకు ధనుర్దాసు దంపతుల జ్ఞాన శుద్ధి గొప్పతనాన్ని తెలియజేయాలనుకున్నారు. కొందరు శిష్యులను ధనుర్దాసు ఇంటిలో దొంగతనానికి పంపించారట! వారు ధనుర్దాసు ఇంటికి వెళ్లి ఒకవైపు మలిగి నిద్రిస్తున్న హేమాంబ పైన గల నగలను తీసుకున్నారు. కానీ వచ్చిన వైష్ణవ స్వాములకు మరోవైపు తాను ధరించిన నగలను తీసుకొనుటకు సహకరించాలని ఆమె మరోవైపు తిరిగింది. ఆమె మేల్కొన్నదని భావించి వారు భయపడి పారిపోయారు. ఈ విషయం తెలిసిన ధనుర్దాసు హేమాంబ పైన దోషం మోపి వారి స్వాతంత్ర్యాన్ని భంగం చేశావు! అని కోపించి నిందించాడట! వస్త్రాల కోసం గొడవ పడిన స్వాములకు విలువైన నగలు పోయినా చలించని ధనుర్దాసు గొప్పతనాన్ని జ్ఞానస్ఫూర్తిని యతిరాజులు లోకానికి తెలియజేశారు.

శ్రీభగవద్రామానుజాచార్యులు దయార్ద్ర హృదయులు. ఎంతోమంది శిష్యులతో సేవింపబడుతూ ఉండేవారు. ఒకరోజు వీధిలో తిరిగే అర్భకుడైన మూగవానిని చూచి వర్ణాశ్రమ విభేదాలు లేకుండా దయతో లోపలికి పిలిచి ఆచార్య చరణాలే రక్షకము అని ఉపదేశించి అనుగ్రహించారట!

ఆచార్యనిష్ఠ గల భాగవతోత్తముడు మార్నేర్ నంబి పరమపదించగా శ్రీ రామానుజాచార్యుల ఆచార్యులైన పెరియనంబిగారు వర్ణభేదాన్ని లెక్కించక అంత్యసంస్కారాన్ని చేశారు. దానిని ఎందరో దోషంగా భావించినా విశేష ధర్మంగా భావించి జగదాచార్యులు సమర్థించారు. నేటి సామాజిక సంస్కరణలకు ఆనాడే భగవద్రామానుజాచార్యులు పునాది వేశారు.

"శరీరశుద్ధి, జ్ఞానసిద్ధి" ధర్మానుసరణ అను ప్రవర్తన రీతుల్లో మానవులకు ఏది ప్రధానమో ప్రబోధించారు.


## మన దేవాలయాలు

**(5వ పేజీ తరువాయి)** సీతయ్యాచారులు, నర్సయ్యాచార్యులు. ముదలగువారు అర్చకకైంకర్యం చేశారు. నేడు పరంపరగా వారివంశీయులు అర్చకత్వం చేస్తున్నారు.

ప్రతి సంవత్సరం మాఘమాస శుద్ధ ఏకాదశి నుంచి మాఘ బహుళ పంచమి వరకు ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతాయి శుద్ధ ద్వాదశి నాడు స్వామి వారి కళ్యాణం తో ఆరంభం చేసుకుని పౌర్ణమి నాడు డోలోత్సవం జరుపుకొని పంచమినాడు రథోత్సవం జరుపుకుంటాం మరుసటి రోజు ఏకాంత ఉత్సవం జరుపుకొని బ్రహ్మోత్సవాన్ని పూర్తి చేసుకుంటాం అయితే ఇందులో ఒక ప్రత్యేకత ఉంది కేవలం తిరుమలలో మాత్రమే జరిగేటటువంటి పార్వేటోత్సవం మళ్లీ ఇక్కడ మాత్రమే జరుగుతుంది. బ్రహ్మోత్సవాలలో జరిగే "దోపుకథ" చాలా అద్భుతంగా ఉంటుంది.


తెలంగణాలో జరిగే జాతరల్లో బీరుపూర్ జాతర ప్రధానమైనది. ఇక్కడి ప్రధానార్చకులు వొద్దిపర్తి సంతోషాచార్యులు ఉప అర్చకులు సంతోషాచార్యులు (చిన్న సంతోష్) వొద్దిపర్తి మధు కుమార్ ఆచార్యులు వారి సేవలను ప్రతినిత్యం అందిస్తుంటారు. పూర్వం కేవలం బ్రహ్మోత్సవాల్లో మాత్రమే గుట్ట కింది నుంచి నీళ్లను తీసుకెళ్లి స్వామికి అభిషేకం చేసి ఉత్సవాన్ని జరిపేవారు. ఇప్పుడు. ప్రతిరోజు స్వామివారికి అభిషేకం జరుగుతుంటుంది అలానే యజుర్వేద పండితులు డింగరి హేమంత్ ఆచార్యులు సామవేద పండితులు వొద్దిపర్తి సంజయ్ ఆచార్యులు పంచరాత్ర ఆగమ పండితులు సముద్రాల గోపాలకృష్ణమాచార్యులు కూడా వారి సేవలను అందిస్తూ తరిస్తుంటారు ఆలయ సిబ్బంది చైర్మన్ నేరెళ్ల సుమన్ గౌడ్ ఈవో సంకటాల శ్రీనివాస్ గారు ఆలయ అభివృద్ధిని చూస్తుంటారు. అర్చకుల ఆగమొక్త అర్చనా విధానంతో, అలంకరణలతో భక్తుల సమ్మర్దంతో. ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి.

# సమతా కుంభ్ 2023 - బ్రహ్మోత్సవమ్





సమతామూర్తిని మనముందు ఆవిష్కరించిన ఆచార్యులు మనకు ముఖ్యంగా తెలుగునేలకు, ఆపై సమస్త భారతావనికి అందించిన మధురఘట్టం. ఒక చారిత్రక సత్యం. సమతా మూర్తిని ఆవిష్కరించుకుని అప్పుడే సంవత్సరం గడిచిందా?! ఈ వేడుకలో మనమేం చేయగలం అని తపనపడిన హృదయాలకు బ్రహ్మోత్సవ వేడుకలు ఒక వూరట. అందరి మనసులోని భావన తెలుసుకున్న ఆచార్యులు మనకు ఈ సందర్భంగా ఎన్నో వరాలు ప్రసాదించారు. అందులో ముఖ్యమైనవి మనలను కదలించినవి శ్రీరామానుజనూత్తందాది, శ్రీభగవద్గీత పారాయణ ఘట్టాలు. చిన్నా పెద్దా, ముసలి ముతకా అందరూ మేముసైతం పాల్గొన్నామన్న భావన కలిగేలా చేశాయి. ఇలా చెప్పుకుంటూ వెళితే! జీవితాలను కబళించే మహమ్మారిని



తుదముట్టించేలా వికాసతరగిణి ముందుండి వైద్య బృందాల ద్వార చేస్తున్న సేవలను సమతాకుంబ్ 2023 వేదికమీద తెలియజేసారు. వికాసతరంగిణి వారు చేస్తున్న సేవలు సమాజంలోని దిగువస్థాయివారికి కూడా దశాబ్దకాలంగా ప్రయోజనాలు ఆందిస్తున్నాయి. సమతా కుంభ్ కార్యక్రమంలో వార్షిక బ్రహ్మోత్సవాలు, హెూమాలు, ఆధ్యాత్మిక సాంసృతిక కార్యక్రమాలతో పాటు 108 దివ్యదేశ దెవతామూర్తుల శాంతి కళ్యాణోత్సవాలు కన్నుల పండుగగా కనిపించాయి. శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయరు స్వామి వారితో కలిసి అష్టాక్షరీ మూలమంత్ర పారాయణం చేసే భాగ్యంలో పాలుపంచుకుని ఎందరో ధన్యులు అయ్యారు. దేశ విదేశాల నుంచి అనేక మంది భక్తులు రావటం, భగవత్ గీత అవధానం, ప్రముఖులు, రాజకీయ నాయకులు పాల్గొనటం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణ. ప్రతి ఒక్కరు నాటి సహస్రాబ్ది వేడుకలను గుర్తు చేసుకున్నారు. శ్రీసన్నిధానం పత్రిక కూడా ఆనాటి అక్షరకైంకర్యాన్ని స్మరించుకుంటున్నది.





# శుభాలనొసగే శోభకృత్ నామ సంవత్సరమ్

**తెలుగు రాష్ట్రాల ప్రముఖ పంచాంగ జ్యోతిష్య శాస్త్ర పండితులు శ్రీమాన్ శ్రీ తి.న.చ. సంపత్కుమారాచార్య, సిద్ధాంతి గారు శ్రీసన్నిధానం పత్రిక ద్వారా శోభకృత్ నామ సంవత్సర శుభ ఫలితాలను అందించారు. వత్సరాంత శుభాశుభ ఫలితాలు ప్రజలందరికీ శుభఫలాలుగా పరిణమించాలని భావిస్తూ, క్షేమారోగ్య సౌఖ్యము కలవారై సమస్త సౌఖ్యములను పొందుదురు గాక!**

**॥ స్వస్తిశ్రీ సర్వేషాం జనానాం సమస్త మంగళాని భవన్తు ॥**



**శ్రీమాన్ శ్రీ తి.న.చ. సంపత్కుమారాచార్య, సిద్ధాన్తి**


ఈ సంవత్సరము చైత్ర వైశాఖములయందు ఎండలు హెచ్చుగాను అచ్చుటచ్చుట శిలాసహిత వృష్టియు కొన్నిచోట్ల భయోత్పాతములు భూకంపాది ఉపద్రవములు ధాన్యాదుల ధరలు సరసము. జ్యేష్ఠాషాఢ మాసముల యందు సస్యానుకూల వర్షములు పాడిపంటల సమృద్ధియు పశువృద్ధి ఆహార ధాన్యముల ధరలు మధ్యమము, శ్రావణ భాద్రపద మాసముల యందు అత్యధిక వర్షములు కల్గి, నదీ నదములు చక్కగా ప్రవహించును. ప్రజలకు పీడలు తొలుగును. ఆశ్వయుజ కార్తీక మాసముల యందు తుఫాన్ వర్షములు, ఆహార ధాన్యముల ధరలు మందము. మార్గ శీర్షాది చాతుర్మాస్యముల యందు రాజకీయ వొడిదొడుకు లుండును. ధాన్యాది వస్తువుల ధరలలో హెచ్చు తగ్గులుండును ప్రజా కలహములున్ననూ తీరిపోవును.

రాజు బుధుడు మంత్రి సేనాధిపతి శుక్రుడై సస్యనీరసాధిపతి చంద్రుడై ధాన్యాధిపతి శనియై మేఘఅర్ఘాధిపతి గురుడై రసాధిపతి బుధుడైనందున సర్వసస్యములు చక్కగా ఫలించును. రాజులు ప్రజలు పరస్పరము స్నేహ భావముతో ప్రవర్తించుదురు. ప్రజాభీష్ట పరిపాలన యుండును. దేశమంతటా అధికస్థాయిలో వర్షములు కురియును. అపరసస్యములు బాగుగా ఫలించును. పూర్వసస్యములు, మధ్యమఫలదములు, నల్లని భూములు, నల్లని ధాన్యములు, జలధాన్యములు, స్థలధాన్యములు, మాగాణి మెట్ట పంటలు బాగుగా ఫలించును. ప్రపంచము నందు బ్రాహ్మణులు యజ్ఞ యాగాది ఉత్సవములు శుభకార్యములు ఆచరించుదురు. ప్రజలు రోగభయములు లేక సుఖ సంతోషములను అనుభవించుదురు. ప్రపంచమంతా ఆర్థిక మాంద్య మున్ననూ మనదేశములో అంతగా కనిపించదు. పంట దిగుబడులు బాగా పెరుగును. విదేశీ పెట్టుబడులు విదేశీ మారక ద్రవ్యముల నిల్వలు ఎగుమతులు బాగా పెరుగును. విద్యావైద్య పారిశ్రామిక రంగముల యందు అభివృద్ధియు నూతన పరిశ్రమలధికము. వైజ్ఞానిక పరిశోధనలు న్యాయవ్యవస్థలు ధార్మిక సంస్థలు తమవంతు కృషి సల్పి బాగా రాణించును. ఇతర దేశాలతో సత్సంబంధాలు కొనసాగును. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రాబడి యధికముగా వచ్చును. భారతీయ వ్యాపారవేత్తలకు అంతర్జాతీయ గుర్తింపు లభించును. సరిహద్దు ప్రాంతముల దేశములతో యుద్ధ వాతావరణ మేర్పడును. పురుషులు స్త్రీ లోలురై యుందురు. వాయుపీడ యధికము లిపి లేఖకులకు శిల్పకారులకు వృద్ధి, లోహములు ముత్యములు రత్నములు అలంకార వస్తువుల ఉత్పత్తి యధికము. గోధుమలు, మంచిధాన్యము, జొన్నలు, సజ్జలు, **(మిగతా 15 వ పేజీలో)**

మకర సంక్రాంత్రి నిర్ణయం :ఈ సంవత్సరం 15-01-2024 పుష్య శు॥ చవితి సోమవారం
తేదీ:30-03-2023 నుండి 27-04-2023 గురు మౌఢ్యమి
తేదీ:09-08-2024 నుండి 18-08-2023 శుక్ర మౌఢ్యమి
గ్రహణ నిర్ణయం : పాక్షిక చంద్ర గ్రహణం
తేదీ: 28-10-2023 అశ్విని నక్షత్రం, మేష,తులా,మీనా రాశుల వారు చూడరాదు.
స్పర్శకాలము రాత్రి 1-05 ని. మోక్షకాలము : రాత్రి 2-22, ఆద్యంత పుణ్యకాలం రాత్రి: 1-17 ని.

# జ్యోతిర్విజ్ఞానమ్

## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక



శ్రీసన్నిధానం పాఠకులు మీ జ్యోతిష్య శాస్త్ర సందేహాలను ప్రశ్నగా మాకు పంపండి, పరిష్కారాలను పొందండి! ఈ విజ్ఞానామృతాన్ని మీరూ ఆస్వాదించండి!!

---

**ప్రశ్న:** ఏ పని చేయాలన్న మంచి ముహూర్తం చూడండి అంటారు. మంచి ముహూర్తం అంటే ఏమి? వ్యక్తికి తార మంచిది కావలెనా? తిథి మంచిది కావలెనా? నక్షత్రమా, ఆ ముహూర్త లగ్నమా? ఏది?

జవాబు: మంచి ముహూర్త మనగా, శ్లో॥ తిథి వారంచ నక్షతం, యోగం కరణమేవచ, పంచాంగ మితి విఖ్యాతం కాలోయం కర్మ సాధకః". మానవుడు, మంచి ఫలమును గోరి ఏ పనైనా చేయడానికి ప్రయత్నిస్తాడు. అట్టి ఫలమును సునాయాసముగా సాధించుటకు, సునాయాస మార్గాన్ని అవలంబిస్తాడు. అందులో సుముహూర్తమును నిర్ణయించుకునే ముందు పంచ అంగములు పటిష్ఠముగా ఉన్నయెడల, అనగా తిథివలన మనోధైర్యము, వారం వలన స్థిరత్వము, నక్షత్రము వలన ఆర్థికాభి వృద్ధి, యోగం వలన ఆరోగ్యము, కరణం వలన కీర్తి కలుగుతాయి. ఇవి పటిష్ఠముగా చూచుకొని కార్యాన్ని ఆచరించాలి. కార్య సమయం, మంచిరాశి అనగా లగ్నము, ఆ లగ్నమునకు శుభగ్రహములు - వీక్షణమును కలిగి యున్న సమయమును సుముహూర్తము అంటారు. అ సమయమును సమస్తశ్రేయస్సుల కోసం మనము అనుసరిస్తాము. శాశ్వత లాభాలను పొందుతుంటాము.

---

**(గత సంచిక తరువాయి)** ఆ తర్వాత మూడవది ప్రశ్న భాగం. ప్రశ్న అంటే జీవితమే ఒక ప్రశ్న. దివ్యమైన ఆ ప్రశ్న! ఇది ఎందుకు జరుగుతోంది? ఏం జరుగుతోంది? ఎప్పటివరకు జరుగుతుంది? అనే విషయాన్ని, మనం చేసిన దానికి ఏదో ఒక కార్యక్రమానికి ఇలా ఎందుకు చేశాను? ఎందుకు చేయాల్సి వచ్చింది? దీని పర్యవసానం ఇలా ఎందుకు వచ్చింది? అని మనకే అర్థం కానటువంటి స్థితి కలుగుతుంది. ఆ అగమ్య, అగోచరమైన స్థితి వచ్చినప్పుడు ఏం చేస్తాము అంటే సంఖ్యల ప్రకారంగా, గ్రహాల ప్రకారంగా, సమయం ప్రకారంగా అద్భుతమైనటువంటి ప్రశ్నను పరిశీలించాలి. ఎందుకు జరిగింది? అనే దానికి సమాధానం వెతుక్కోవటం. శాస్త్రంలో దానికి ప్రశ్న భాగం అని పేరు. ఇక నాలుగు ఐదు. ఖగోళ, భూగోళ భాగాలు. ఇవి ఏం చేస్తాయి అంటే? నక్షత్ర గమనాలు ఏమిటి? నక్షత్రంలో వుండే విలక్షణాలు ఏమిటి? ఏ నక్షత్రం ఏ కార్యక్రమానికి ఉపయోగపడుతుంది. దాని తర్వాత భూమి మీద ఉండేటటువంటి క్షేత్రం. భూమి అంతా ఒకటే కాని ఆ భూమి అనేకమైన రంగుల చేత, అనేకమైన వాసనల చేత, చక్కనైన ఎత్తు పల్లాల చేత ఉంటుంది. ఒక్కొక్క భూభాగంలో జరిగే వైశిష్ట్యత ఇంకో భూభాగంలో ఉండదు. భూమి ఒకటైనా ఉండే ప్రాంతాన్ని బట్టి, దానికుండే లక్షణాన్ని బట్టి ఏ ఏకార్యక్రమాలు ఏ ఏ స్థలాలలో ఎలా చేయవచ్చో అనే విషయాన్ని భౌగోళిక పరిస్థితుల గురించి తెలుసుకోవడం. ఆ తరువాత నక్షత్ర గమనాన్ని గురించి తెలుసుకొనేది ఖగోళ, భూగోళ శాస్త్రాలు. ఆరవ భాగమైన విషయం వాస్తు శాస్త్రం అంటారు. వాస్తు శాస్త్రంలో నైసర్గిక భౌగోళిక స్థితి, మరియు వస్తు నిర్మాణం, వస్తు నిర్మాణం ద్వారా మానవులకు ఉండేటటువంటి విశేషమైన ఉపయోగాల గురించి వాస్తు శాస్త్రంలో చెప్పబడి ఉంది.



**(మిగతా 15 వ పేజీలో)**

## పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం

**(8వ పేజీ తరువాయి)** వేదం చెప్పినటువంటి మాతృదేవోభవ పితృదేవోభవ ఆచార్య దేవోభవ అతిథి దేవోభవ అనే సూక్తులకు పూర్తిగా ఆచరణ రూపమైనటువంటి ఒక అవతారం రామావతారం. అటువంటి రామావతారం చైత్రశుద్ధ నవమినాడు ఏర్పడింది. దీనిని వేదం కూడా కొనియాడింది. "భద్రో భద్రయా సచామాన ఆగాత్" అని ఋగ్వేదం.

ఈ మంత్రంలో రామ కథను చెప్పబడింది అంటారు. వేదాలలో కూడా రామకథ వుంది. అటువంటి రామునియొక్క కథను మనకు వాల్మీకి మహర్షి చాలా గొప్పగా అందించారు. రామచంద్రమూర్తి యొక్క అవతారం ద్వారా మనం మానవ ధర్మాన్ని తెలుసుకోవచ్చు. శ్రీరామ నవమి ఈ సంవత్సరం మార్చి 30వ తారీఖున జరుగుతున్నది. ప్రధానంగా శ్రీరామ నవమి ఉత్సవాలు అయోధ్య మొదలైన ప్రత్యేక రామ క్షేత్రాల్లో, మన తెలుగునాట తెలంగాణ ప్రాంతంలో ఉన్న భద్రాచలంలో శ్రీరామనవమి వేడుకలు చాలా అద్భుతంగా ఉంటాయి. ముఖ్యంగా భద్రాచలంలో రాముడు అవతరించినటువంటి శ్రీరామనవమి రోజుననే సీతారాముల కళ్యాణం జరగడం అనేది గొప్ప విశేషం. ఆ సీతారామ కళ్యాణాన్ని ఈనాడు చేయడంలో ప్రధాన ఉద్దేశ్యం ఏమిటంటే పాంచరాత్ర ఆగమ సంహితల్లో పురుషోత్తమ సంహితలో "యస్య కళ్యాణ సమయే తస్య కళ్యాణ మాచరేత్" అని ఉన్నది. అంటే ఏ దైవమునకు సంబంధించినటువంటి అవతారం ఉంటుందో ఆ అవతారం జరిగినటువంటి జయంతి రోజున కళ్యాణం చేయవచ్చు. ఆ సంహిత అనుసారంగా భక్త రామదాసు గారు భద్రాచలంలో శ్రీరామనవమి నాడు సీతారాముల కల్యాణోత్సవాన్ని జరిపేటువంటి ఏర్పాటు చేశారు. దాన్ని పురస్కరించుకుని భద్రాచలంలో రాముడు అవతరించినటువంటి శ్రీరామ జయంతి శ్రీరామ నవమినాడే సీతారామ కళ్యాణోత్సవము జరుగుతుంది. అంతేకాకుండా భద్రాచలంలో ఈ ఉత్సవాలను పక్షం రోజుల పాటు నిర్వహిస్తారు. చైత్రశుక్ల పాడ్యమి నుండి పూర్ణిమ వరకు ఈ ఉత్సవాలు 15 రోజులు నిర్వహిస్తారు. ఉత్సవాలు రెండు రకాలు ఒకటి రాముడు అవతరించినటువంటి రోజును పురస్కరించుకొని వసంత నవరాత్రి ఉత్సవాలు వాటితోపాటుగా నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ఈ రెండూ కలిపి పక్షం రోజులపాటు ప్రతి సంవత్సరము వైభవోపేతంగా ఈ ఉత్సవాలు భద్రాచలంలో నిర్వహింపబడతాయి. ఈ సంవత్సరం ఒక గొప్ప విశేషం ఏమిటంటే ఈ నవరాత్రి నవాహ్నిక బ్రహ్మోత్సవాలతో పాటుగా పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం ప్రత్యేకంగా నిర్వహించబడుతోంది. రామావతారంలో రాముడు ఒక క్షత్రియ వంశంలో అవతరించి రాజ్యాన్ని పరిపాలించాడు కనుక రామరాజ్యం అంటాం. రాముడినికి పట్టాభిషేకం చేసేటటువంటి ఆచారం మనలో ఉన్నది. రామాయణ పారాయణం జరుపుకొన్న తర్వాత ప్రత్యేకంగా పట్టాభిషేక ఉత్సవాలు జరుపుకోవడం ఒక ఆచారం. పురాణాల్లో ధర్మ శాస్త్రాల్లో చెప్పబడిటువంటి ఈ గొప్ప ఆచారాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం భద్రాచలంలో శ్రీరామనవమి మరునాడు దశమినాడు పట్టాభిషేకం జరుగుతుంది. అంతేకాక ప్రతి సంవత్సరం కంటే ఈ సంవత్సరం జరిగేటువంటి పట్టాభిషేకానికి ఒక విశేషం. ప్రధానంగా భద్రాచలంలో ఈ ఉత్సవాలను ప్రతి ప్రభవ నామ సంవత్సరంనాడు చేస్తారు. 60 సంవత్సరాలకు ఒకసారి శ్రీరామనవమి మరునాడు జరిగేటువంటి పట్టాభిషేక మహోత్సవానికి మహా సామ్రాజ్య పట్టాభిషేకము అని పేరు. 60 సంవత్సరాలకు ఒకసారి సేవించడం అందరికీ సాధ్యం కాదు కనుక దాన్ని ప్రతి 12 సంవత్సరాలకు చేసే ఒక ఆచారాన్ని ప్రవేశపెట్టారు.

ఆ ప్రకారం ప్రభవ తర్వాత వచ్చేటువంటి 12 సంవత్సరాలు ఇలా కూడుకునట్లయితే గతంలో 1987 లో జరిగినటువంటి మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు తిరిగి ఈ సంవత్సరం ఇప్పుడు మూడవ పుష్కర పట్టాభిషేకోత్సవం నిర్వహింపబడుతుంది. ఇది 2011 సంవత్సరం తర్వాత ఈ శోభకృత్ నామ సంవత్సరంలో పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం స్వామివారికి నిర్వహింపడుతుందన్నమాట!.

మానవజన్మకు సార్థకత చేకూర్చే రామచంద్రమూర్తిని దైవంగా పూజించే ఒక గొప్ప సంప్రదాయం మన దేశంలో ఉంది. రామాలయం లేని గ్రామం మన తెలుగు నాట లేదు. అటువంటి రామచంద్రమూర్తికి భద్రాచలంలో ఎంతో గొప్ప స్థానం ఉన్నది. ఈ భద్రాచల క్షేత్రాన్ని గొప్ప పుణ్యక్షేత్రంగా బ్రహ్మ పురాణంలో కీర్తిస్తారు వేదవ్యాస మహర్షి. అటువంటి ఈ పుణ్యక్షేత్రంలో జరిగే తృతీయ సామ్రాజ్య పట్టాభిషేకం వేడుకగా చేస్తున్నారు. ఉగాది నుంచి ప్రారంభించి దశమి వరకు జరిగే ఈ ఉత్సవాలలో రామక్రతువు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకత ఏమిటంటే నవాహ్నిక బ్రహ్మోత్సవాలతో పాటుగా ద్వాదశకుండాత్మక శ్రీరామాయణ మహాక్రతువు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఈ మహా క్రతువుకు "చతుర్వేద పురస్కృత పంచేష్టి సహిత నవాహ్నిక ద్వాదశ కుండాత్మక శ్రీరామాయణ మహాక్రతువు" అని పేరు పెట్టారు. 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఉత్సవాలు కనుక 12 మంది

**(మిగతా 15 వ పేజీలో)**



# జ్యోతిర్విజ్ఞానం

**(13 వ పేజీ తరువాయి)** వాస్తులో పది భాగాలు ఉన్నాయి. స్థల వాస్తు, స్థలం యొక్క నైసర్గిక స్వరూపం అనగా ఎత్తు పల్లములు, పర్వతాలు, నదులు, సముద్రాలు వాటి గురించి వివరిస్తుంది. ఏ స్థలం ఎటు ఎత్తు ఉంది, ఎటు పల్లంగా ఉంటే, ఎటు జలం ఉంటే, ఎటు పర్వతం ఉంటే, ఎటు బరువుంటే, ఎటు తేలిక ఉంటే ఏ ఫలితం ఇస్తుంది అని చెప్తుంది దశవిధ వాస్తులలో మొదటిది ఈ స్థల వాస్తు.

రెండవది స్థానం. స్థానం అంటే భూమి కుండేటటువంటి యొక్క లక్షణాలు. కొన్ని భూములలో మనం వ్యవసాయం చేస్తూ ఉంటే, ఉదాహరణకు వరి పొలం వేశాం అనుకోండి. ఒక చోట అద్భుతమైన ఎత్తయినటువంటి వరి ఎత్తుగా పెరుగుతుంది. మరి మరొకచోట సమానమైన ఎరువు నీరు పోసినా ఎత్తుగా పెరగదు. అది స్థలం యొక్క గుణం. ఆ స్థల పరిశీలన చేసిన తర్వాత ఇక్కడ గృహ నిర్మాణం చేసుకోవచ్చా, ఆలయ నిర్మాణం చేసుకోవచ్చా, ఆశ్రమం నిర్మాణం చేసుకోవచ్చా, ఏదైనా కళ్యాణ మండపాలు కట్టుకోవచ్చా, గోశాల కట్టుకోవచ్చా, గజశాల, అశ్వశాల, రథశాల కట్టుకోవచ్చా అని చెప్పేటటువంటి లక్షణం ఉందో దీనిని స్థాన వాస్తు అంటారు.

**మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో...**

## శుభాల నాసగే శోభకృత్ నామ సంవత్సరమ్

**(12 వ పేజీ తరువాయి)** మినుములు, నువ్వులు కృష్ణకాటుకలు, నల్లఆవాలు, సూక్ష్మధాన్యములు చింతపండు, పెసలు, కందులు, పిప్పళ్ళు, శొంఠి, మిరియాలు, అల్లము, ఇంగువ, ఉల్లిపాయలు, ఆముదములు, అవిసెలు నెయ్యి నూనె, నూనెగింజలు, వేరుశనగ, చెఱుకు, ఉప్పు, బెల్లం, పంచధార, పసుపు, మజ్జిగ, వెన్న, పాలు పెరుగు చందనము పత్తిగింజలు మామిడి, పనస, నారింజ, కొబ్బరికాయలు, నల్లమందు తేయాకు విస్తర్లు, కాగితము అగరు వస్తువులు, తెల్లని రంగులు, చర్మములు, బూడిదరంగు చిలుకపచ్చ చీరెలు, వస్త్రములు దూది నూలు రంగులు, తమలపాకులు, బంగారము, వెండి, ఇత్తడి కంచు మొదలగు వస్తువులకు ధరలు పెరుగును. పెట్రోలు, డీజిల్, వంటనూనె, మాంసము, తోలు, మత్తు పానీయములు సిమెంటు ఇటుక, రాయి, కలప, గ్రానైట్, వాహనముల ధరలు యధికము. పుణ్యక్షేత్రముల యందు భద్రత యవసరము. వర్షములధికముగా కురిసి చెరువులు నిండి నదీనదములు చక్కగా ప్రవహించును.

**శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలతో. . .**

## పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం

**(15 వ పేజీ తరువాయి)** పారాయణ చేస్తూ చతుర్వేద పురస్కృత, చతుర్వేద హవనం మార్చి 31వ తారీకు దశమి నాడు పూర్ణాహుతి తో వైభవోపేతంగా నిర్వహింపబడుతుంది.

రామరాజ్యాన్ని కోరుకుంటూ ఆనాడు పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక ఉత్సవాన్ని వైభవోపేతంగా భద్రాచలంలో నిర్వహించడం జరుగుతుంది. దానికోసం భద్రాచలం దేవస్థానం వారు ఎంతో వైభవంగా ఏర్పాట్లుచేసారు.

ఈ దేశంలో ఉండే అనేక మైన పుణ్యనదీ తీర్థాలను తెప్పిస్తున్నారు. గంగా యమునా సరస్వతి గోదావరి కృష్ణా తామ్రపర్ణి ఇలాంటి అనేక నదులు, అలాగే తీర్థములు తిరుపతి మొదలైనటువంటి ప్రదేశాల్లో స్వామి పుష్కరిణి, పద్మ పుష్కరిణి అనే ఆయా దివ్య దేశములలోని గొప్ప పుష్కరిణి తీర్థాలను, అదేవిధంగా సముద్ర జలాలను ప్రత్యేకించి తెప్పించి ఈ 31న సామ్రాజ్య పట్టాభిషేకం ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు.

రాముని అవతారం గురించి మనం చెప్పుకుంటున్నాము. రాముడిని మనం దైవం అనుకుంటే దైవంగా అనుగ్రహిస్తాడు. కాదు ఒక మానవునిలా మనం భావించినా ఆయన ఆచరణ అనేటువంటిది తల్లిదండ్రుల దగ్గర ఒక కుమారుడు ఎలా ప్రవర్తించాలి?, భార్య దగ్గర భర్త ఎలా ప్రవర్తించాలి?, ఒక గురువు దగ్గర శిష్యుడు ఎలా ప్రవర్తించాలి?, ఒక రాజ్యాన్ని పరిపాలించే రాజు ఏ విధంగా తాను మసలుకోవాలి?, స్నేహితుడు దగ్గర మరొక స్నేహితుడు ఏ విధంగా నడుచుకోవాలి?, ఒక శత్రువును ఏవిధంగా ఎదుర్కోవాలి? ఇలాంటి అనేక మైనటువంటి మానవ ధర్మాలను లోకానికి ఆచరణలో చూపించినటువంటి ఒక గొప్ప అవతారం శ్రీరామావతారం. అటువంటి రామావతారాన్ని మనం దైవంగా భావించి పూజిస్తే ఆ రాముడు ఒక గడ్డిపోచను బ్రహ్మాస్త్రంగా చేయగలడు. అలాగే ఒక కోతిని దైవంగా పూజించేట్లుగా చేయగలడు. అటువంటి రామచంద్రమూర్తిని మనం మానవుడిగా భావించి ఆయన ఆచరణను మనం అలవరచుకున్నప్పటికి లోకంలో మనం ఎంతో చక్కని మనుగడ సాగించే అవకాశం ఉన్నది. రాముని దైవం అనుకున్నా పర్వాలేదు, ఒక మానవుడు అనుకున్నా పర్వాలేదు. రాముడనేటువంటివాడు ఆదర్శ మానవుడు. ఆదర్శ మానవుడైనటువంటి రాముని యొక్క అవతారం రోజు మార్చి 30వ తారీఖున భద్రాచలంలో జరిగే కళ్యాణ మహోత్సవంలో భాగంగా జరిగేటువంటి పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం మహోత్సవంలో పాల్గొని భక్తులు తరించవలసింది. ★

# ఆధ్యాత్మిక వార్తలు

## శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు



శ్రీ ధర్మపురి లక్ష్మి నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి నుండి ప్రారంభమై ఫాల్గుణ శుద్ధ అష్టమి నాడు ముగుస్తాయి. ఈ సంవత్సరం మార్చి 03 న అంకురార్పణతో మొదలై మార్చి 15న ఉగ్ర నరసింహ స్వామికి ఏకాంత సేవ తో పూర్తి అవుతున్నాయి.

### శ్రీమన్నాథ మునుల తిరునక్షత్ర మహోత్సవం



శ్రీమన్నాథ మునుల 1200 వ తిరునక్షత్ర సందర్భంగా తేదీ 17-02-2023 నుండి 19-02-2023 వరకు వరకు తిరునక్షత్ర మహోత్సవం ఉభయ వేదాంత ఆచార్య పీఠం, ఇందిరా జాతీయ సాంస్కృతిక కళల శాఖ భారత ప్రభుత్వం వారిచే నిర్వహింపబడి శంషాబాద్ లో శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి వారి ఆధ్వర్యంలో జరిగింది.

### వైభవంగా నిజామాబాద్‌లో

## చతుర్వింశతి కుండాత్మక శ్రీసుదర్శన నారసింహ యాగం

ఫిబ్రవరి 4వతేదీ నిజామాబాద్‌లో చతుర్వింశతి కుండాత్మక శ్రీ సుదర్శన నారసింహ యాగం వైభవంగా జరిగింది. లోకకల్యాణార్థం ఈ యాగాన్ని నిర్వహించగా శ్రీ.ఉ.వే శ్రీ చిలుకమఱ్ఱి శ్రీవర్ధనాచార్యులు యాగశాల నిర్మాణ బాధ్యతలు నిర్వహించారు. ఈ యాగాన్ని నిర్వహించడానికి శ్రీవిల్లి పుత్తూరు జీయర్ స్వామి, గంగోత్రి మఠం ఉత్తరాది కారిని ఆహ్వానించామని శ్రీ చిలుకమఱ్ఱి శ్రీవర్ధనాచార్యులు



తెలిపారు. స్థానికులు శ్రీమాన్ హయగ్రీవాచార్య, శ్రీమాన్ నాగరాజాచార్య, శ్రీమాన్ వినోద్ ఆచార్య పాల్గొన్నారు. తొలుత ఫిబ్రవరి 4 సాయంత్రం పుణ్యాహవాచనం, రక్షాబంధనము, అంకురారోపణ. మంటప పూజ వాస్తు పూజ, యాగశాల ప్రవేశ కార్యక్రమాలు జరిగాయి. యాగశాల “భద్రక మండలము” విధానమున చిలుకమఱ్ఱి శ్రీవర్ధనాచార్యులు యాగశాల, యజ్ఞకుండ నిర్మాణములను నిర్వహించారు. చివరగా శాంతి కళ్యాణంతో యాగం సుసంపన్నమైంది. ఈ యాగం సంకల్పించిన శ్రీమన్ కందాళై నర్సింహ్మమూర్తి, శ్రీమతి రాధిక దంపతులకు పెద్దలు భాగవతోత్తములు మంగళాశాసనములు అందించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో యాగంనిర్వహించినందుకు భక్తులు సంతోషాన్ని వ్యక్తంచేశారు.



శ్రీమాన్ గుదిమెళ్ళ
మురళీ కృష్ణమాచార్యులు గారికి

## ఆచార్య సమ్మానము

శ్రీవెంకటేశ్వర ఆగమ విద్వత్ సదస్సు టి.టి.డి నందు ఉభయ వేదాంత పరీక్షాధికారులు ఆమ్నాయ విద్వన్మణి వేద విద్వాంసులు శ్రీ ఉ .వే శ్రీమాన్ గుదిమెళ్ళ మురళీ కృష్ణమాచార్యులు గారికి అయిభీమవరంలో తిరుమల తిరుపతి శ్రీవెంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం వారు ఆచార్య సమ్మానము చేయడం జరిగింది.